క్లుప్తంగా

శ్రీముఖలింగంలో విశిష్ట హోమాలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో బుధవారం విశిష్ట హోమాలు నిర్వహించారు. తాడేపల్లి గూడెంకు చెందిన గుర్రం సత్యనారాయణ ఆధ్వర్యంలో చండీ యాగం, మహన్యాస పూజలు, రుద్రాభిషేకం, లక్ష్మీ, నక్షత్ర, నవగ్రహ హోమాలు చేశారు.

ఆకట్టుకున్న రంగవల్లిక



పాఠశాల ఆవరణలో వేసిన రంగవల్లిక

సారవకోట: మండలంలోని అవలింగి జేబీటీ పాఠశాల ఆవరణలో బుధవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు వేసిన దీపావళి రంగవల్లిక ఆకట్టుకుంది. దీపావళికి కాలుష్య రహిత టపాసులు కాల్చాలని కోరుతూ ఈ రంగవల్లిక ఏర్పాటు చేశామని పాఠశాల డైరెక్టర్ మోహనగాంధీ తెలిపారు.

ఈ-పంట నమోదు పత్రాల పంపిణీ



ఈ-పంట నమోదు పత్రాలతో రైతులు

నరసన్నపేట: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-పంట నమోదు ప్రక్రియ పూర్తయిందని, మండలంలో 12 వేల మంది రైతులు తమ పంటలను నమోదు చేసుకున్నారని నరసన్నపేట ఏడీ రవీంద్ర భారతి అన్నారు. నరసన్నపేట రైతు సేవా కేంద్రంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ-పంట నమోదు పత్రాలను రైతులకు పంపిణీ చేశారు. నరసన్నపేట మండలంలో 17,168 ఎకరాల్లో వరి పంట నమోదైందన్నారు. అన్ని పంటలు కలిపి 18,300 ఎకరాల్లో నమోదు చేశామన్నారు. ఉర్లాంలో నిర్వహించిన కార్యక్రమంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త భాగ్యలక్ష్మి పాల్గొని రైతులకు సూచనలు చేశారు. ఏఓ కె.సునీత తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

నరసన్నపేట: యువతను అన్ని రంగాల్లోనూ తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుడుతోందని, యువత నైపుణ్యాలతోపాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి కె.వెంకట ఉజ్వల అన్నారు. బుధవారం నరసన్నపేటలో పద్మావతి, ఎల్‌వీఆర్ డిగ్రీ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులతోపాటు నరసన్నపేట పోలీసులు, మూలపేట వివేకానంద యువజన సేవా సంఘం సభ్యులు సంయుక్తంగా మేరా యువ భారత్ మొదటి వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. దీంట్లో భాగంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, మార్కెట్‌ను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు, ఎస్‌ఐ దుర్గాప్రసాద్, సెట్‌శ్రీ సూపరింటెండెంట్ ఎల్.లేఖ, సర్పంచ్ బూరల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలసీమలో నరకాసుర వధ



నరకాసురుడి దిష్టి బొమ్మ

నరసన్నపేట: మండలంలోని బాలసీమలో గల కోదండరామాలయం వద్ద దీపావళి పండగను పురస్కరించుకుని బుధవారం నరకాసుర వధను గ్రామస్తులు నిర్వహించారు. గత వందేళ్లుగా నరకాసుర వధను ఆనవాయితీగా చేపడుతున్నారు. అనంతరం కోదండరాముడి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్‌ఈడీ బల్బుల పంపిణీ

మెళియాపుట్టి: మండలంలోని చీపురుపల్లి ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్వాసితులకు పాతపట్నం జనసేన ఇన్‌చార్జి కొరికాన భవాని తన సొంత నిధులతో 50 ఎల్‌ఈడీ బల్బులు సమకూర్చారు. వాటిని బుధవారం మండల జనసేన నాయకులు దుక్క బాలరాజు (టెక్కలిపట్నం నిర్వాసితులకు) అందించారు.

- నత్తనడకన నమోదు ప్రక్రియ
- ఆధార్‌లో తేడాలే జాప్యానికి కారణం
- తప్పుల సవరణకు ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్న విద్యార్థులు

అపార్‌కు ఆపసోపాలు



ఆమదాలవలస ప్రధాన తపాలా కార్యాలయంలో గల ఆధార్ కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న విద్యార్థులు

ఆమదాలవలస: నూతన జాతీయ విధానంలో భాగంగా ప్రతీ విద్యార్థికి జీవితకాల గుర్తింపు సంఖ్యతో కార్డు జారీ చేయాలని మూడేళ్ల కిందటే కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఆధార్ మాదిరిగానే ఆటో మేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) పేరుతో 12 అంకెల గుర్తింపు కార్డు జారీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. విద్యార్థుల అకడమిక్ పురోగతిని అంచనా వేయడానికి ఇది ఉపయోగపడనుంది.

ఆమదాలవలస, ఎల్.ఎన్.పేట, నరసన్నపేట నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల వివరాలు		
మండలం	విద్యార్థులు	అపార్ పూర్తయినవారు
ఆమదాలవలస	11,583	2,407
బూర్జ	4,109	973
పొందూరు	8,203	1,209
సరుబుజ్జిలి	3704	1,346
ఎల్.ఎన్.పేట	2,678	596
హిరమండలం	5,277	1,516
కొత్తూరు	8,603	2,161
మెళియాపుట్టి	7,283	857
పాతపట్నం	12,854	900
నరసన్నపేట	16,594	3,552
జలుమూరు	6,741	1,550
పోలాకి	7,939	1,092
సారవకోట	4,757	1,560

హెచ్‌ఎంలకే బాధ్యత..

అపార్ కార్డుల జారీ బాధ్యతలను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలకు అప్పగించారు. లక్ష్యం మేరకు కార్డులు జారీ చేయకపోతే తాఖీదులు ఇస్తామని విద్యాశాఖ అధికారులు ఇప్పటికే హుకుం జారీ చేశారు. చాలామంది విద్యార్థుల వివరాలు పాఠశాలలో ఒకలా.. ఆధార్ కార్డులలో మరోలా ఉన్నాయి. ఒకసారి అపార్ కార్డు ఇస్తే విద్యార్థి చదువు పూర్తయ్యేవరకు ఇదే నంబర్ ఉంటుంది. ఈ నేపథ్యంలోనే విద్యార్థుల వివరాలు నమోదులో పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

తప్పులు సవరించుకుంటేనే...

7, 8 ఏళ్ల కిందట ఆధార్ తీసుకున్న వారి వివరాల్లో పెద్ద ఎత్తున తప్పులున్నాయి. ప్రస్తుతం అపార్ కార్డులను ప్రాధాన్యతాంశంగా పరిగణించాలని చెబుతున్నారు. ఆధార్‌లోని తప్పులను సరిచేసుకోవాల్సి ఉంది. ఇందుకోసం ఆధార్ కేంద్రాకు వెళ్లాలి. గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు లేవు. ఆమదాలవలస పట్టణంలోని హెడ్ పోస్టాఫీస్‌కు బూర్జ, సరుబుజ్జిలి, ఆమదాలవలస తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తున్నారు. అక్కడ సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో రోజంతా పడిగాపులు కాయాల్సివస్తోంది. రోజుకు 50 మందికి మాత్రమే ఆధార్ ప్రక్రియ చేస్తామని కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు.

ఇలా చేస్తే బాగుంటుంది..

పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లను అడ్మిషన్ రిజిస్టర్ ప్రకారం హెచ్‌ఎంలే యూడైస్‌లో మార్చేలా అవకాశం ఇవ్వాలి. స్కూల్‌లో అడ్మిషన్ రిజిస్టర్ ప్రకారం హెచ్‌ఎంలు సర్టిఫికెట్ ఇస్తే.. ఈ వివరాల ప్రకారం ఆధార్ కేంద్రాల్లో మార్చేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. ఆధార్ వివరాల సవరణ బాధ్యత హెచ్‌ఎంలకు అప్పగిస్తే ప్రయోజనం ఉంటుంది.

పడిగాపులు కాస్తున్నాం



ఆధార్ కార్డులోని వివరాలను మార్పు చేసేందుకు హెడ్ పోస్టాఫీసులో ఉన్న ఆధార్ కేంద్రం వద్ద గత మూడు రోజులుగా పడిగాపులు కాస్తున్నాం. రోజూ సర్వర్ పనిచేయడం లేదని చెప్పడంతో వెనుదిరుగుతున్నాం. నా తోటి విద్యార్థులు కూడా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వమే దీనికి ప్రత్యామ్నాయం ఆలోచిస్తే బాగుంటుంది.

– రావాడ నవీన్‌కుమార్, పదో తరగతి విద్యార్థి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆమదాలవలస

హెచ్‌ఎంలే ఈ ప్రక్రియ పూర్తి చేయాలి



ఆమదాలవలస మండలం, మున్సిపాలిటీలో గల విద్యార్థుల వివరాలను అపార్‌లో నమోదు చేసే ప్రక్రియ హెచ్‌ఎంలు త్వరితగతిన పూర్తిచేయాలి. కొంతమంది విద్యార్థుల వివరాలు ఇప్పటికే నమెదు చేశారు. మిగిలిన వారివి కూడా నమోదు చేయాలి. టెక్నికల్‌గా ఇబ్బందులు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సరి చేసుకోవాలి.

– జి.రాజేంద్రప్రసాద్, ఎంఈఓ, ఆమదాలవలస

ఇవేం 'చెత్త' పనులు..



సారవకోట మండలం బుడితి గ్రామంలో మురుగునీటి కాలువలపై పలకలు వేయకపోవడంతో చెత్త పేరుకుపోయింది. ఇటీవల గ్రామంలోని డ్రైనేజీల్లో చెత్త, మురుగును తొలగించేందుకు దుకాణాలు, ఇళ్ల గడపలను పగలగొట్టారు. మురుగు తొలిగించిన అనంతరం స్థానికులే వాటిని మరలా నిర్మించుకున్నారు. పంచాయతీ అధికారులు కాలువలపై పలకలు వేయకపోవడంతో కాలువల్లో మరలా చెత్త చేరింది. డ్రైనేజీలపై పలకలు వేయాలని స్థానికులు కోరుతున్నారు. – సారవకోట

చి'వరి' తడి కోసం పాట్లు



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలం రొట్టవలస సమీపంలోని లివిరి బంద వద్ద డీజిల్ ఇంజిన్ ద్వారా వరి పొలాలకు సాగునీటిని తరలిస్తున్నది. పంట చివరి దశకు వచ్చింది. చుక్క నీటికోసం రైతులుకు తిప్పలు తప్పడంలేదు. రొట్టవలస సమీపంలోని 27-ఎల్ వంశధార పిల్ల కాలువ సక్రమంగా ప్రవహించడం లేదు. సుమారు 100 ఎకరాల సాగు భూమికి డీజిల్ ఇంజిన్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. అధికారులు స్పందించి పంట పొలాలకు సాగునీరు అందేలా కాలువను బాగుచేయాలని రైతులు కోరుతున్నారు. – సరుబుజ్జిలి

మురికి కూపంలా..



ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలోని రోటరీ నగర్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవటంతో పలు వీధులు చెత్త, మురుగుతో నిండాయి. సిమెంట్ రోడ్లు వేసినప్పటికీ డ్రైనేజీలు నిర్మించలేదు. ఇళ్లల్లో వాడిక చేసిన నీరు, వర్షం నీరు రోడ్లుపైనే నిలుస్తోంది. ఈగలు, దోమలు వ్యాప్తిచెంది రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి డ్రైనేజీలు నిర్మించాలని కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

ప్రమాదకరం..



పాతపట్నం మండలంలోని సీది నుంచి రుగడ వెళ్లే రహదారి మలుపు వద్ద (తీమర సమీపంలో) వారం రోజులుగా ఫైబర్ వైరు రోడ్డుపైనే ఉంది. సీది నుంచి రాకపోకలు చేసే వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఫైబర్ వైరు విద్యుత్ స్తంభాలకు కట్టించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

– పాతపట్నం

అన్నదాత సుఖీభవ ఎప్పుడిస్తారు?



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- హామీలు అమలులో కూటమి ప్రభుత్వానిది వాయిదాల పద్ధతి
- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు వాయిదాల పద్ధతిని అమలు చేస్తున్నారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నంలోని తన క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఐదు నెలలు అవుతున్నా.. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయటంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. రైతులను అన్ని విధాలా మోసం చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. పంట పెట్టుబడి కోసం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేలు అందజేస్తామని హామీ ఇచ్చారని, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ పూర్తయిందన్నారు. అన్నదాత సుఖీభవ ఎప్పుడు ఇస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీల్లో మహిళలకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయని, వాటిని అమలు చేయకుండా మహిళలను మోసం చేస్తున్నారన్నారు. 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న మహిళలకు నెలకు రూ.1500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం పథకం ద్వారా ఎంతమంది చదివితే అంతమందికి ఏడాదికి రూ.20 వేలు తల్లుల ఖాతాల్లో జమచేస్తామని ఊదరగొట్టారన్నారు. ఈ ఐదు నెలల పాలనలో ఉచిత గ్యాస్ మాత్రమే ఇస్తున్నారని, మిగిలిన పథకాలు అమలు చేసేందుకు ఎన్ని వాయిదాలు కావాలో రాష్ట్ర ప్రజలకు, మహిళలకు సీఎం చంద్రబాబు స్పష్టంగా తెలియజేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు ఉన్న పంచాయతీల్లో శిలాఫలకాలపై వారి పేర్లు ఉండటం లేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు చెప్పిన సమయానికే సంక్షేమ పథకాల మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో వేశారని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పెనుమజ్జి విష్ణుమూర్తి, రెడ్డి రామారావు, బలగ గోవిందరావు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు వినతుల వెల్లువ



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

కొత్తూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు 282 వినతులు వచ్చాయి. వీటిని అధికారులు పరిశీలించి అర్జీదారులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కొత్తూరు సీహెచ్‌సీ స్థానంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని, ప్రభుత్వ డిగ్రీ కాలేజీని మంజూరు చేయాలని, సుమారు వేయి ఎకరాలకు సాగునీరు అందించిన భారీ చెక్ డ్యామ్ తిత్లీ తుఫాన్‌కు కొట్టుకుపోయిందని, చెక్ డ్యామ్‌ను నిర్మించాలని, కొత్తూరులోని కాలేజీ రోడ్డులోని కల్వర్టును తెరిపించాలని, గొట్టిపల్లి, అడ్డంగితోపాటు పలు గిరిజన పంచాయతీల్లో రోడ్లు నిర్మించాలని, నివగాం నుంచి సోమరాజపురం వరకు రోడ్డు పొడైనందున మరమ్మతులు చేపట్టాలని వినతులు అందాయి. ఎంపీపీ సవర సావిత్రి, ఎంపీడీఓ నీరజ, తహసీల్దార్ రవిచంద్ర, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి, అధికారులు

సారవకోట: పాడి పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం మండలంలోని కిన్నెరవాడలో పశుసంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధిశాఖల ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. అత్యుత్తమ లేగదూడలను ఎంపిక చేసి యజమానులకు బహుమతులు అందజేశారు. పశుసంవర్ధకశాఖ జేడీ ఆర్.మురళి, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, డీడీ వి.జయరాజ్, ఏడీ ఎం.లోకనాథం, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ



జలుమూరు: గొల్లపేటలో ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: కృష్ణప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ధర్మాన కృష్ణదాస్, తదితరులు

జలుమూరు: మండలంలోని పలు కుటుంబాలను మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ బుధవారం పరామర్శించారు. గొల్లపేటకు చెందిన గొల్ల లచ్చమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబ పెద్ద పిట్ట ప్రసాద్‌ను, రామకృష్ణాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రేగాన శ్యామ్ సమీప బంధువు లచ్చన్నబాబు మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని, జోనంకి పంచాయతీ గంగాధరపేటకు చెందిన పూజారి సింహాచలం మృతి చెందడంతో సర్పంచ్ జి.వి.రమణి కుటుంబాన్ని, హుస్సేనుపురం పంచాయతీలో చాప అప్పయ్య మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ వాన గోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు కనుసు సీతారాం, పైడి విఠల్‌రావు, అల్లాడ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎం.శ్యామలరావు, పి.ముసలినాయుడు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు దామ మన్మధరావు, ఆదిబాబు, జుత్తు నేతాజీ, కె.హరిప్రసాద్, పి.విజయ్, వెలమల అసిరినాయుడు తదితరులు ఉన్నారు.

నరసన్నపేట మండలంలో..

నరసన్నపేట: మండలంలోని సత్యవరం గ్రామానికి చెందిన యగళ్ల కృష్ణప్రసాద్ అలియాస్ సంతోష్ కుటుంబాన్ని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ బుధవారం పరామర్శించారు. హైదారాబాద్‌లో క్రికెట్ ఆడిన తరువాత సంతోష్ అలసటకు గురై మృతిచెందిన విషయం విదితమే. ఆయన తల్లిదండ్రులు కృష్ణమూర్తినాయుడు, సూర్యకుమారిని పరామర్శించారు. మండలంలోని బాలసీమ, బాడాం తదితర గ్రామాల్లో కూడా పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. ఎంపీపీ ఆరంగి మురళి, సర్పంచ్ బూరల్లి శంకర్, పార్టీ నాయకులు చింతు రామారావు, కేసీహెచ్‌బీ గుప్త, రాజాపు అప్పన్న, రఘుపాత్రుని శ్రీధర్, అల్లు అసిరినాయుడు, యగళ్ల నర్సునాయుడు ఉన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

నరసన్నపేట: క్యాన్సర్ లక్షణాలు, కారణాలు, నివారణ, చికిత్సపై సెంటర్ ఫర్ సెల్యులార్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ)కి చెందిన పరిశోధకుడు తమ్మినేని యతిరాజారావు అవగాహన కల్పించారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో బుధవారం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మన దేశంలో అధికంగా ఏడు రకాల క్యాన్సర్లు వస్తున్నాయని వివరించారు. తొలి దశలో గుర్తిస్తే క్యాన్సర్ నుంచి బయటపడవచ్చన్నారు. పద్మావతి విద్యాసంస్థల డైరెక్టర్ దుర్గాప్రసాద్, బోటనీ అధ్యాపకుడు డి.బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

నరసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతోపాటు విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.ప్రభాకరరావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి డీఏల బకాయిలు ఉన్నాయన్నారు. డీఏలు వస్తాయనే ఆశతో ఉన్న అనేక మంది వాటిని అందుకోకుండానే చనిపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ డీఏలను లెక్కించి విడుదల చేయాలన్నారు. ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు ఏ విధంగా మండుతున్నాయో తెలిసిందేనన్నారు. నవంబర్ 11న జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో డీఏలపై ప్రకటన చేయాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

పాతపట్నం: గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరిగతిన పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.కరుణాకరరావు, ఎంపీడీఓ చంద్రకుమారి అన్నారు. మండలంలోని సీతారాంపల్లిలో ఉన్న జగనన్న లేఅవుట్‌ను హౌసింగ్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. 2025 మార్చి 31వ తేదీకి ఇళ్ల నిర్మాణాలను కచ్చితంగా పూర్తిచేయాలన్నారు. హౌసింగ్ ఏఈ సీతారామరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నైపుణ్య గణనపై అవగాహన

మెళియాపుట్టి: మండలంలోని నైపుణ్యం కలిగిన యువతను గుర్తించి, వారి వివరాలను యాప్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ నరసింహ ప్రసాద్ పండా అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయం ఆవరణలో ఏపీఎంలు, డిజిటల్ సహాయకులు తదితర సచివాలయ సిబ్బందికి నైపుణ్య గణనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మొబైల్ అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకుని దానిలో వివరాలు ఎలా సేకరించాలో వివరించారు. తద్వారా నిరుద్యోగులను గుర్తించి, వారి అర్హతలు, పూర్తి వివరాలు పొందుపర్చబడతాయని, వారికి ఉపాధి కల్పనకు అవకాశం ఉంటుందన్నారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం



అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఎస్‌ఐ, సిబ్బంది

ఆమదాలవలస: అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి (ఫైర్ ఎస్‌ఐ) బొడ్డేపల్లి హరినారాయణ సూచించారు. బుధవారం పట్టణంలోని చిన్నకృష్ణాపురంలో గల మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల్లో చిక్కుకొని గాయపడిన వారిని ఎలా రక్షించాలో వివరించారు. పర్యావరణ రహితంగా దీపావళి పండగ నిర్వహించాలని సూచించారు. హెచ్‌ఎం ఎం.వెంకటరత్నమమ్మ, ఉపాధ్యాయులు, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.